సాక్షి అనంతపురం

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



టన్ను చీనీ రూ.15 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు ప్రకారం విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.34

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
34.3°/22.7°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 15 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నాలుగు మండలాలకు ఎంఈఓల నియామకం

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలో ఖాళీగా ఉన్న నాలుగు మండలాలకు ఎంఈఓలను నియమించారు. కుందుర్పి మండల విద్యాశాఖ అధికారిగా రాయదుర్గం ఉన్నత పాఠశాల హెచ్ఎం కే.శంకరన్న, డి.హీరేహాళ్ మండల విద్యాశాఖ అధికారిగా గుంతకల్లు ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ టి.వేణుగోపాలరావు, కంబదూరు మండల విద్యాశాఖ అధికారిగా అనంతపురం నంబర్-2 ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ టీచరు బి.ఉమాపతి, గుమ్మఘట్ట మండల విద్యాశాఖ అధికారిగా కళ్యాణదుర్గం కేసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ సైన్స్ టీచరు పి.సోమశేఖర్ (ఎఫ్ఏసీ)ను నియమిస్తూ పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో డి.హీరేహాళ్ ఎంఈఓ వేణుగోపాలరావు శుక్రవారం బాధ్యతలు తీసుకోనున్నారు. తక్కిన ముగ్గురూ గురువారం బాధ్యతలు చేపట్టారు.

డీసీహెచ్ఎస్‌గా డేవిడ్ సాల్విన్ రాజ్



అనంతపురం మెడికల్: డీసీహెచ్ఎస్‌గా డాక్టర్ డేవిడ్ సాల్విన్ రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన డీసీహెచ్ఎస్ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. తాడిపత్రి ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌గా ఉన్న ఆయన్ను ఇన్‌చార్జ్ డీసీహెచ్ఎస్‌గా నియమించారు. గతంలో ఈయన ప్రొద్దుటూరు, పులివెందుల ఏరియా ఆస్పత్రుల్లో సూపరింటెండెంట్‌గా పని చేశారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న డాక్టర్ డేవిడ్‌కు సిబ్బంది అభినందనలు తెలిపారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు



అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ లేదా సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. బాలికలకు ఉరవకొండ కళాశాలలో ఎంఈసీ గ్రూపులో ఎస్సీ-18, ఎస్టీ-2, ఓసీ-1, సీఈసీలో ఎస్సీ-1, ఎస్టీ-1, ఓసీ-1, బ్రహ్మసముద్రం కళాశాలలో హెచ్ఈసీలో ఎస్సీ-9, ఎస్టీ-1, ఓసీ-1, సీఈసీలో ఎస్సీ-6, నల్లమాడ కళాశాలలో సీఈసీలో ఎస్సీ-39, ఎస్టీ-3, ఓసీ-1, బాలురకు సంబంధించి కణేకల్లు కళాశాలలో బైపీసీలో బీసీ-2, ఎస్సీ-1, కాళసముద్రం కళాశాలలో ఎంపీసీలో ఎస్టీ-1, బైపీసీ గ్రూపులో బీసీ-2, ఎస్సీ-2 సీట్లు ఖాళీలున్నాయని వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు నేరుగా సర్టిఫికెట్లతో ఆయా కళాశాలలకు వెళ్లి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. అలాగే పప్పూరులోని బాలుర ఐఐటీ, నీట్ కళాశాలలో బైపీసీ గ్రూపులో ఎస్సీ-2 సీట్లు ఖాళీలున్నాయన్నారు. పదో తరగతిలో రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాల్లో 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.

కొత్త రేషన్ కార్డు మంజూరు కావడం లేదు. కార్డులోకి పేరు చేర్చమంటున్నా పట్టించుకోవడం లేదు. కార్డుకు సంబంధించి ఆధార్ సీడింగ్ కరెక్షన్, తొలగింపు తదితర ప్రక్రియలనూ అటకెక్కించారు. కూటమి సర్కారు నిర్లక్ష్య ధోరణితో జిల్లాలో పేద ప్రజలు విసిగిపోతున్నారు. రేషన్ సరుకుల్లో కోత మినహా కొత్త కార్డుల గురించి పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కొత్త కార్డులు.. కళ్లకు కాయలు



రేషన్ సరుకుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రేషన్ కార్డుల పరిస్థితి ఇలా

కేటగిరీ	దరఖాస్తులు
కొత్తగా చేరిక	2,19,877
కార్డు నుంచి తొలగింపు	25,672
ఆధార్ సీడింగ్	2,361
రైస్‌కార్డు నుంచి మార్పు	33,611
కొత్త రైస్ కార్డు	35,401
చిరునామా మార్పు	7,719

- అటకెక్కిన రేషన్ కార్డుల మంజూరు
- పట్టించుకోని కూటమి సర్కారు
- రేషన్ కార్డుకు సంబంధించి దరఖాస్తులన్నీ బుట్టదాఖలు
- విసిగిపోతున్న పేద ప్రజలు
- ఇంకెప్పుడు మంజూరు చేస్తారంటూ మండిపాటు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేద ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం కళ్లకు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నా ఫలితం కానరావడం లేదు. దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నారు. దరఖాస్తులు తీసుకున్నాం.. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కార్డులు ఇస్తాం అంటూ ఏడాదిగా కాలం వెళ్లదీస్తుండడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో 35 వేల మంది పైగా కొత్త కార్డుల కోసం దరఖాస్తులు అందజేశారు.

బుట్టదాఖలు..

కొన్ని కుటుంబాల్లో పెళ్లిళ్లు జరిగి ఉంటాయి. లేదా పిల్లలు పెద్దవాళ్లై ఉంటారు. అలాంటి వారి పేర్లు రేషన్ కార్డులోకి చేర్చాలి. కానీ అర్హులు ఏడాదిగా బతిమాలుతున్నా చేర్చడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.19 లక్షల మంది తమ పేరును రేషన్ కార్డులో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకూ అతీగతీ లేదు. దరఖాస్తులు చెత్తబుట్టల్లో వేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేదు..

మృతి చెందిన వారి కార్డులు తొలగించి ఎప్పటికప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు. గత సర్కారు హయాంలో ఎప్పుడూ సంతృప్త స్థాయిలో ఎప్పటికప్పుడు ఇచ్చేవారు. గ్రామ/వార్డు సచివాలయాల నుంచి దరఖాస్తు చేసుకోగానే మంజూరు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాది నుంచి కొత్త రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయింది. ఇందుకోసం వచ్చిన దరఖాస్తులు ఎక్కడున్నాయో కూడా తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇక చిరునామాలు, పేర్లలో మార్పులకు అసలు దిక్కేలేదు.

రేషన్‌లో కోత మినహా..

రేషన్ సరుకుల్లో కోత మినహా కూటమి సర్కారు చేస్తున్నదేమీ లేదని లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు. గతంలో గోధుమలు ఇచ్చేవారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఆరునెలలుగా వాటిని ఇవ్వడం లేదు. జొన్నలూ లేవు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో 8 వేల మందికి పైగా వృద్ధులకు రేషన్ అందడం లేదు.

6 నెలలుగా ఎదురుచూస్తున్నా



“ఏడు నెలల క్రితం నాకు వివాహమైంది. ఆ తర్వాతి నెలలోనే కొత్త రేషన్ కార్డు దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకూ మంజూరు కాలేదు. అధికారులను అడిగితే అదిగో ఇదిగో అంటూ చెబుతున్నారు.

– మధు, ఇల్లూరు గ్రామం, గార్లదిన్నె మండలం

పట్టించుకునే నాథులే లేరు..



నా భార్య అనిత పేరును మా రేషన్ కార్డులోకి కొత్తగా చేర్చాలని కోరుతూ దరఖాస్తు ఇచ్చి దాదాపు ఏడాదైంది. అప్పటి నుంచి సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయింది. కళ్యాణదుర్గం రెవెన్యూ కార్యాలయం అధికారులను సంప్రదించినా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

– మారుతి, దొడగట్ట, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ

ఆప్షన్ ఇవ్వలేదంటున్నారు



నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇప్పటికీ మేమంతా మా తల్లిదండ్రుల రేషన్ కార్డులోనే ఉన్నాం. నా కుటుంబానికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని మా గ్రామ సచివాలయ అధికారులను కోరా. వారేమో ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వలేదని చెబుతున్నారు.

– జయరాం, పడమటి కోడిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

టీడీపీ సర్పంచ్ దౌర్జన్యం

- తనది కాని భూమిలో చొరబడి విత్తనం వేసిన వైనం
- ఎలా వేస్తారంటూ ప్రశ్నించిన రైతుపై దౌర్జన్యం



తన భూమిలో విత్తనం వేస్తున్న దృశ్యాన్ని చూపుతున్న బాధిత రైతు జయకుమార్

ఉరవకొండ(విడపనకల్లు): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీడీపీ నేతల దౌర్జన్యాలకు అడ్డు లేకుండా పోతోంది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండ నియోజకవర్గంలో ఈ పరిస్థితి తారస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. తాజాగా విడపనకల్లు మండలం జనార్దనపల్లికి చెందిన టీడీపీ సర్పంచ్, తన అనుచరులతో కలసి తనది కాని భూమిలో దౌర్జన్యంగా విత్తనం వేయడం కలకలం రేపింది. ఉరవకొండ పట్టణానికి చెందిన బాధిత రైతు జయకుమార్ విడపనకల్లు డిప్యూటీ తహసీల్దార్, గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. 2023, జూన్ 24న జనార్దనపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 141లో 21.05 ఎకరాల భూమిని రైతు జయకుమార్ కొనుగోలు చేశాడు. అప్పటి నుంచి ఆ భూమిలో మిర్చి, కందులు తదితర పంటలు సాగు చేస్తున్నాడు. గురువారం ఉదయం ఆ గ్రామ సర్పంచ్ జనార్దననాయుడు, మరికొందరు టీడీపీ నాయకులు ఆ భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ట్రాక్టర్‌తో కంది విత్తనం వేశారు. విషయం తెలుసుకున్న జయకుమార్, ఆయన కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని సర్పంచ్‌ను నిలదీశారు. ఆ సమయంలో బాధిత రైతు, ఆయన కుటుంబసభ్యులపై సర్పంచ్ దౌర్జన్యం చేస్తూ దిక్కున్న చోటుకెళ్లి చెప్పుకోవాలని బెదిరింపులకు దిగారు. దీనిపై తనకు న్యాయం చేయాలంటూ తహసీల్దార్, డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు బాధిత రైతు తెలిపాడు. న్యాయం జరగకపోతే ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని వాపోయాడు.

రైతాంగాన్ని ఆదుకోకపోతే పోరాటాలే

- చంద్రబాబు హామీ మేరకు రైతులను ఆదుకోవాల్సిందే
- గత ప్రభుత్వంలో 53.58 లక్షల మందికి 'భరోసా' ఇచ్చాం
- అన్నదాతలను ఆదుకునే దిశగా మంత్రులు, ఎమ్మెల్యేలు ఆలోచించాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతాంగం కరువు కోరల్లో చిక్కుకున్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు. కరువు పరిస్థితుల నుంచి బయట పడేసేందుకు ప్రణాళిక రూపొందించలేదు. రైతాంగం పట్ల ఇంత నిర్లక్ష్యం చూపుతున్న ప్రభుత్వాన్ని నా ప్రజా జీవితంలో ఎన్నడూ చూడలేదు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించిన అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20,000 ఇంత వరకు ఇవ్వలేదు. రైతాంగాన్ని ఆదుకోకపోతే పోరాటాలు తప్పవు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. కేంద్రంతో సంబంధం లేకుండా 'అన్నదాత సుఖీభవ' కింద ఏటా రూ.20 వేలు ఇస్తామని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక కేంద్రంతో కలిపి ఇస్తామని చెబుతుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే తొలి ఏడాది రైతులను ఎగనామం పెట్టారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 53.58 లక్షల మంది రైతులకు ఏటా రైతు భరోసా పథకం కింద రూ.13,500 అందజేశారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 5.74 లక్షల మంది లబ్ధి పొందారని గుర్తు చేశారు. రైతులు నేడు ఈ-కేవైసీ, ఎన్‌పీసీఐ లింక్ కోసం కష్టాలు పడుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. 'తల్లికి వందనం' తరహాలో 'అన్నదాత సుఖీభవ'లో రైతులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వమే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేదని, కూటమి ప్రభుత్వంలో రైతులే ప్రీమియం చెల్లించాలని బాబు నిబంధన పెట్టారని దుయ్యబట్టారు. బీమా ప్రీమియం గడువు ముగిసినా నేటికీ చాలా మంది రైతులు కట్టలేదన్నారు. గత ఏడాది ఖరీఫ్, రబీలో ఇన్సూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదని, ఈ ఏడాదీ అదే పరిస్థితిని కొనసాగించి రైతులను నిలువునా ముంచుతారా? అని ప్రశ్నించారు.

సమీక్ష నిర్వహించాలి..

రైతాంగాన్ని ఆదుకునే దిశగా ఉమ్మడి జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు సమీక్ష నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని 'అనంత' అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 15 లక్షల ఎకరాలుగా ఉందని, కానీ ఈ ఏడాది కార్తెలు దాటిపోయినా ఇప్పటి వరకు కేవలం 3.94 లక్షల ఎకరాల్లోనే వివిధ పంటల సాగు చేశారన్నారు. వేరుశనగ 8 లక్షల ఎకరాలకు పైగా సాగు చేసేవారుంటే ప్రస్తుతం 1.63 లక్షల ఎకరాల్లోనే సాగు చేశారన్నారు. ప్రత్యామ్నాయ పంటల సాగు విషయంపై ప్రభుత్వం ఆలోచన చేయాలని సూచించారు. తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా ప్రణాళిక లేకపోవడంతో నీరు సముద్రం పాలవుతోందని వాపోయారు. ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డు సమావేశం నిర్వహించలేదన్నారు.

బ్లాక్‌లో ఎరువులు..

హెచ్ఎల్‌సీ కింద అక్కడక్కడా నాట్లు వేద్దామనుకుంటే ఎరువుల కొరత వేధిస్తోందన్నారు. జిల్లాలో రైతాంగం బ్లాక్‌లో ఎరువులు కొనుగోలు చేయాల్సిన దౌర్భాగ్య స్థితికి అధికారులు తీసుకువచ్చారని మండిపడ్డారు. అక్కరకు రాని ఫర్టిలైజర్స్ కొనుగోలు చేస్తేనే ఎరువులు ఇస్తామంటూ చెబుతున్నారని, దీని వెనుక అధికారులు, వ్యాపారులు కుమ్మక్కయ్యారని దుయ్యబట్టారు. రైతులను ఆదుకోవాలని కోరితే తమపై విమర్శలు చేయడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ఏది ఏమైనా రైతాంగాన్ని ఆదుకునేందుకు రైతులు, రాజకీయ పార్టీలను కలుపుకుని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు అనుమతి తప్పనిసరి

- ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ



అనంతపురం అర్బన్: అహుడా పరిధిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా అనుమతి పొందాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ స్పష్టం చేశారు. అహుడా పరిధిలో వీలైనంత ఎక్కువగా భూ బ్యాంక్ గుర్తించాలని చెప్పారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. అనంతపురం, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాల్లో అహుడా చేపట్టిన పనులు, వాటి పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహుడా పరిధిలో ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారితో సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. నగర, పట్టణ కేంద్రాల్లో నివాసయోగ్యమైన ప్రాంతాలకు దగ్గరగా భూములను ఎంపిక చేయాలని చెప్పారు. భూ సేకరణ క్రమంలో పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు.లే అవుట్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలని చెప్పారు. సమావేశంలో అహుడా కార్యదర్శి జి.రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ అధికారి ఇషాక్, ఈఈ దుష్యంత్, జేపీఓ హరీష్, సర్వేయర్ శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ'కు ఏర్పాట్లు చేయండి

'అన్నదాత సుఖీభవ పథకం' ఈనెల 2న ప్రారంభం కానున్న నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈనెల 2న ప్రకాశం జిల్లా దర్శిలో పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమం వీక్షణకు ఏర్పాట్లు చేయడంతో పాటు ప్రజాప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. సచివాలయ స్థాయిలోనూ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జిల్లాలో 2,80,418 మంది అర్హులైన రైతులు ఉండగా, ఇందులో 2,74,210 మంది రైతులకు ఈ-కేవైసీ పూర్తయ్యిందన్నారు. 5,579 మందికి ఈ-కేవైసీ తిరస్కరణ జరిగిందన్నారు. 629 మంది ఈ-కేవైసీ పెండింగ్‌లో ఉందని, ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో అర్హులైన రైతుల జాబితా ప్రదర్శించాలని చెప్పారు. ప్రతి రైతుకూ లింక్ షేర్ చేయాలన్నారు. అన్నదాత సుఖీభవ పోర్టల్, మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్‌లోని 'మీ స్థితిని తెలుసుకోండి' ఎంపిక ద్వారా రైతుల అర్హత, అనర్హత కారణాలను పరిశీలించుకోవచ్చన్నారు. ఎన్‌పీసీఐ లింక్ కానివారు యాక్టివేట్ చేసుకోవాలని కోరారు. ఆధార్‌ను బ్యాంక్ ఖాతాకు జత చేయాలని సూచించారు.

1,588 దివ్యాంగుల పింఛన్ల నిలుపుదల

- పునఃపరిశీలన పేరుతో ఏడిపిస్తున్న వైనం

అనంతపురం: పింఛను లబ్ధిదారులపై కూటమి సర్కార్ కత్తికట్టింది. జిల్లాలో ఏకంగా 1,588 మంది దివ్యాంగుల పింఛన్లు నిలుపుదల చేసింది. అనంతపురం రూరల్ మండలంలో 207, అనంతపురం అర్బన్ 125, ఆత్మకూరు 68, బెళుగుప్ప 72, బొమ్మనహాళ్ 25, బ్రహ్మసముద్రం 07, బుక్కరాయసముద్రం 26, డీ హీరేహాళ్ 17, గార్లదిన్నె 18, గుత్తి 37, గుత్తి అర్బన్ 83, గుమ్మఘట్ట 28, గుంతకల్లు 21, గుంతకల్లు అర్బన్ 45, కళ్యాణదుర్గం పట్టణం 10, కళ్యాణదుర్గం మండలం 42, కంబదూరు 18, కణేకల్లు 18, కూడేరు 18, కుందుర్పి 36, నార్పల 41, పామిడి 18, పెద్దపప్పూరు 42, పెద్దవడుగూరు 93, పుట్లూరు 33, రాప్తాడు 21, రాయదుర్గం మండలం 26, రాయదుర్గం అర్బన్ 09, శెట్టూరు 08, శింగనమల 28, తాడిపత్రి అర్బన్ 13, తాడిపత్రి మండలం 45, ఉరవకొండ 47, వజ్రకరూరు 18, విడపనకల్లు 12, యాడికి 101, యల్లనూరు మండలంలో 86 మంది దివ్యాంగుల పెన్షన్లు నిలిపివేశారు.

గతమెంతో ఘనం..

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న హయాంలో పింఛన్ కోతలు విధించిన దాఖలాలు లేవు. అప్పట్లో హాయిగా గుండెల మీద చేయి వేసుకుని ప్రతి నెలా ఠంచనుగా ఇంటి వద్దనే పింఛన్లు తీసుకున్న లబ్ధిదారులు కూటమి ప్రభుత్వంలో ఎక్కడ తమ పింఛనుకు ఎసరు పెడతారోనని బిక్కుబిక్కుమంటున్నారు. చంద్రబాబు సర్కార్ కొలువుదీరిన వెంటనే పింఛన్ల కోతకు శ్రీకారం చుట్టింది. చాలా ఏళ్ల నుంచి పింఛన్లు పొందుతున్నవారు కూడా అర్హత నిరూపించుకోవాలంటూ సర్వే, స్పెషల్ డ్రైవ్‌కు తెరతీసింది. పునఃపరిశీలనకు రావాలంటూ దివ్యాంగులకు నోటీసులు జారీ చేసిన అధికారులు... గైర్హాజరయ్యారంటూ ఈ నెల నుంచి పింఛన్లను తాత్కాలికంగా నిలుపుదల చేయడం గమనార్హం.వాస్తవానికి నిర్దేశించిన సమయానికే తాము హాజరైనా, హాజరుకాలేదని పేర్కొంటూ పింఛన్ నిలుపుదల చేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నమ్మించి మోసం..

ఎన్నికల ముందు టీడీపీ నేతలు మాయమాటలు చెప్పారు. బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీలకు 50 ఏళ్లకే పింఛను ఇస్తామంటూ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. అయితే, అధికారంలోకి వచ్చాక ఆ హామీని గాలికి వదిలేశారు. ఇదే క్రమంలో ఉన్న పింఛన్లకూ ఎసరు పెడుతుండడం, రాబోయే రోజుల్లో కోతలు మరింత భారీగా ఉండొచ్చని కూటమి సర్కార్ సంకేతాలు ఇస్తుండడంతో లబ్ధిదారులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు.

భారీగా పడిపోయిన వేరుశనగ సాగు

- 1.82 లక్షల హెక్టార్ల అంచనా వేస్తే 40 వేల హెక్టార్లకే పరిమితం
- తీవ్ర వర్షాభావం, 'కూటమి' సాయం లేకపోవడమే కారణం



అనంతపురం అగ్రికల్చర్: ప్రధాన పంటగా దశాబ్దాల పాటు పేరుగాంచిన వేరుశనగ సాగు ఈ సారి కనిష్ట స్థాయికి పడిపోయింది. తీవ్ర వర్షాభావ పరిస్థితులు, కూటమి సర్కారు సకాలంలో నాణ్యమైన విత్తనం ఇవ్వకపోవడం, పెట్టుబడి సాయం అందించకపోవడం తదితర కారణాలతో వేరుశనగ పంట సాగుకు రైతులు ముందుకు రాలేదు. దీంతో ఈ ఖరీఫ్‌లో 1.82 లక్షల హెక్టార్లుగా అంచనా వేసినా... చివరకు 40 వేల హెక్టార్ల వద్ద నిలిచిపోయింది. ఇందులోనూ చాలాచోట్ల నీటి వసతి కింద సాగు చేశారు. ఇక పంట విత్తుకునే సమయం జూలై నెలాఖరుతో ముగియడంతో సీజన్ ముగిసేలోపు వేరుశనగ సాగు 50 వేల హెక్టార్లకు మించి ఉండకపోవచ్చని అంచనా వేస్తున్నారు. వర్షాధారంగా విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయినట్లు చెబుతున్నారు.

దెబ్బతీసిన జూలై వర్షాలు..

సాధారణంగా ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, ఆముదం, పత్తి, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు విత్తుకునేందుకు జూలై నెల మంచి అదను. అయితే జూలైలో వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్ ఏరువాకపై తీవ్ర ప్రభావం చూపింది. జూలైలో 64.3 మి.మీ గానూ 34.5 మి.మీ వర్షపాతం నమోదైంది. సాధారణం కన్నా 46.2 శాతం లోటు వర్షపాతం నమోదు కావడంతో ఖరీఫ్ సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. జూన్‌లో కూడా 61.2 మి.మీ గానూ 21.7 శాతం తక్కువగా 47.9 మి.మీ నమోదైంది. ఇలా సీజన్ ప్రారంభమైన కీలకమైన మొదటి రెండు నెలల్లోనే 125.5 మి.మీ గానూ 35 శాతం తక్కువగా 82.4 మి.మీ వర్షపాతం నమోదు కావడం ప్రధాన పంటల సాగుకు అవరోధంగా మారింది. కణేకల్లు, కుందుర్పిలో మాత్రమే సాధారణం కన్నా కాస్త అధికంగా వర్షాలు కురిశాయి. ఆరు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాగా మిగతా 23 మండలాల్లో వర్షాలు చాలా తక్కువగా కురిశాయి. 10 మండలాల్లో అయితే సాధారణం కన్నా 50 నుంచి 70 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది.

ఇక ప్రత్యామ్నాయ పంటలే శరణ్యం..

ఈ ఖరీఫ్‌లో 3,42,232 హెక్టార్లు సాధారణ సాగు విస్తీర్ణంగా అంచనా వేయగా ఇప్పటి వరకు 1.40 లక్షల హెక్టార్లలో పంటలు సాగులోకి వచ్చి ఉంటాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. ఇంకా 2 లక్షల హెక్టార్ల వరకు భూములు బీళ్లుగానే ఉంటాయి. ప్రతి శనివారం మండలాల నుంచి సాగు విస్తీర్ణం గణాంకాలు సేకరిస్తున్నారు. ఆగస్టులో వేరుశనగ సాగు చేయకూడదని రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం. విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఆగస్టు 15 వరకు కంది, ఆముదం, పత్తి, కొర్ర, సజ్జ విత్తుకోవచ్చని సూచించారు. ఆగస్టు 15 తర్వాత ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని తెలిపారు. సాగు గడువు ముగియడంతో వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ విత్తన ప్రణాళికపై దృష్టి సారించారు. మండలాల నుంచి విత్తన ప్రతిపాదన నివేదికలు తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

ఏపీఎస్ఏపీఈ రాష్ట్ర అధ్యక్షుడిగా కూరపాటి



కూరపాటి నరసింహారెడ్డిని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్ఏపీఈ) రాష్ట్ర అధ్యక్షుడిగా శింగనమల మండలం పెరవలిలోని జెడ్పీహెచ్ఎస్ పీడీ కూరపాటి నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలో ఏపీఎస్ఏపీఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉద్యోగ విరమణ రోజే మృతి



వసుంధర (ఫైల్)

గుంతకల్లు రూరల్: వైద్య, ఆరోగ్య శాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వసుంధర గురువారం తన స్వగృహంలో మృతి చెందారు. గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ఆమె ప్రస్తుతం పత్తికొండ మండలం పుచ్చకాలమాడ పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. సర్వీసు పూర్తి కావడంతో గురువారం ఆమె ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంది. అయితే గత కొద్ది రోజులుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న వసుంధర.. ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం కర్నూలు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ, సిబ్బంది ఆమె ఇంటికి చేరుకుని పరామర్శించి వెళ్లారు. వారు వెళ్లిన కొద్దిసేపటికే మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కన్ను మూశారు.

తాగుడుకు డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: తాగుడుకు డబ్బు ఇవ్వక పోవడంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ సోములదొడ్డి పంచాయతీ పావురాలగుట్ట కాలనీలో నివాముంటున్న షాజహాన్ (45), గౌషియా దంపతులు కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో షాజహాన్ కొద్దిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. పనీపాట చేయకుండా ఉదయం లేచినప్పటి నుంచి పడుకునే వరకూ మద్యం తాగుతూ జులాయిగా మారాడు. మద్యం తాగేందుకు డబ్బులు కావాలంటూ తరచూ భార్యను వేధించేవాడు. గురువారం మద్యం కొనుగోలుకు డబ్బు కావాలని అడగడంతో గౌషియా లేవని చెప్పింది. దీంతో క్షణికావేశానికి లోనైన షాజహాన్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గౌషియా ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగలింగారెడ్డి (57) చెన్నేకొత్తపల్లి మండలం యర్రంపల్లిలో గురువారం జరిగిన అల్లుడి కర్మకాండలో పాల్గొనేందుకు భార్య సుధారాణితో కలసి వచ్చాడు. ఈ క్రమంలో కర్మ కాండలు పూర్తయిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకుని వస్తానంటూ భార్యతో చెప్పి గ్రామ సమీపంలోని పట్టాలు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొంది. ప్రమాదంలో శరీరం ఛిద్రమై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హిందూపురం జీఆర్పీ ఎస్ఐ సజ్జప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

నగరంలో ట్రాఫిక్ పద్మవ్యూహం

అనంత వాసికి ట్రాఫిక్ పద్మవ్యూహం చుక్కలు చూపిస్తోంది. పది, ఇరవై నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్య స్థానాలకు కూడా గంటకు పైగా సమయం పడుతోంది. ఒక్కొక్కసారి ఈ సమస్య మరింత తీవ్రమవుతూ ఉంది. వ్యూహాత్మకదారుల అభివృద్ధి పథకం (ఎస్ఆర్‌డీపీ) అందుబాటులో ఉన్నా.. ఆ దిశగా ప్రభుత్వ పెద్దలు చర్యలు చేపట్టకపోవడంతో అనంత నగర ప్రజలు నిత్యమూ ట్రాఫిక్ సుడిగుండంలో చిక్కుకుని ఇబ్బందులు పడుతున్నారు.

- చిక్కుకుంటే బయటపడటం కష్టం

జిల్లాలో వాహనాల సంఖ్య సుమారు **12** లక్షలు

జిల్లా కేంద్రంలో ప్రధాన కూడళ్లు	**30**
ట్రాఫిక్ పోలీసులు ఉండాల్సింది	**250**
ప్రస్తుతం ఉన్నవారు	**110**





నగరంలోని తిలక్ రోడ్డు నీలం టాకీస్ వద్ద స్తంభించిన ట్రాఫిక్, నగరంలోని త్రివేణి టాకీస్ సర్కిల్‌లో ట్రాఫిక్ స్తంభించి ఇబ్బంది పడుతున్న వాహనదారులు

అనంతపురం: 'అనంత'లో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి పోలీసులు తీసుకుంటున్న చర్యలు రెండు అడుగులు ముందుకు, నాలుగు అడుగులు వెనక్కి అన్నట్టుగా ఉన్నాయి. నగరంలో ఒకప్పుడు గంటల్లో సాగిన ప్రయాణం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బహుముఖ వ్యూహంతో చేపట్టిన పనుల వల్ల నిమిషాల్లోనే ముగుస్తూ వచ్చింది. అప్పట్లో చేపట్టిన రహదారుల విస్తరణ పనులు నగర దారులను ప్రగతికి సోపానాలుగా మార్చేశాయి. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత క్రమంగా ట్రాఫిక్ కష్టాలు నగర వాసులను వెన్నాడుతూ వస్తున్నాయి. ప్రస్తుతం నిమిషాల్లో సాగిల్సిన ప్రయాణం... ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుని గంటల సమయం పడుతోంది.

ప్రతి జంక్షన్ పద్మవ్యూహమే

జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా తయారైంది. నగరంలోని వ్యాపార కేంద్రాలు, ఆస్పత్రులు, రైల్వేస్టేషన్, బస్టాండు దగ్గర వాహనాల రాకపోకలు జటిలంగా మారాయి. రుద్రంపేట సర్కిల్, కళ్యాణదుర్గం రోడ్డు సర్కిల్, బళ్లారి రోడ్డు సర్కిల్, సప్తగిరి సర్కిల్, క్లాక్ టవర్, సూర్యనగర్ సర్కిల్, పాతూరు సర్కిల్, గాంధీ బజార్, తిలక్ రోడ్డు, శ్రీకంఠం సర్కిల్ నుంచి పాతూరుకు వెళ్లే మార్గం, శ్రీకంఠం సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండుకు వెళ్లే దారి, బస్టాండు వద్ద ట్రాఫిక్ విపరీతంగా ఉంటోంది. ఆయా ప్రాంతాల్లో వ్యాపార కేంద్రాలు ఎక్కువగా ఉండడంతో దుకాణాలకు వచ్చే కొనుగోలుదారుల వాహనాలను పార్కింగ్ చేయడానికి స్థలం లేకపోవడంతో రోడ్డుపై ఉంచేస్తున్నారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం నెలకొంటోంది. ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వాహన చోదకులు అడ్డదిడ్డంగా దూసుకెళుతుండడంతో ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ స్తంభిస్తోంది. అంబులెన్స్ వంటి అత్యవసర వాహనాలతో పాటు వృద్ధులు, పిల్లలతో వెళ్తున్న వారి అవస్థలు వర్ణనాతీతం. ఇసుక టిప్పర్లు, భారీ వాహనాలు సైతం అనంతపురం నగరంలోని సప్తగిరి సర్కిల్, టవర్‌క్లాక్ మీదుగా వెళ్తున్నాయి. దీంతో రోడ్డు దాటాలంటే పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలను రాత్రి సమయాల్లోనే నగరంలో ప్రవేశించేలా చర్యలు తీసుకోవడంలో పోలీస్ యంత్రాంగం విఫలమవుతోందనే ఆరోపణలున్నాయి.

వేల సంఖ్యలో వాహనాల రాకపోకలు

నగర పరిసర ప్రాంతాల నుంచి రోజూ 30 వేల మంది నగరంలోకి రాకపోకలు సాగిస్తుంటారు. వేల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, బస్సులు, లారీలతో రోడ్లు కిక్కిరిస్తున్నాయి. అంతే కాక నగర విస్తరణ కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. ఇందుకు ఇరుకైన రోడ్లు ఓ కారణమైతే, సిగ్నల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడం మరో కారణంగా తెలుస్తోంది. ఫలితంగా నగరంలోని ప్రధాన కూడళ్లలో అరగంట వరకు రోడ్లపై ఆగిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాతూరులో గాంధీరోడ్డుతో పాటు, తిలక్ రోడ్డు, గాంధీ బజార్ విస్తరణకు నోచుకోలేకపోయాయి. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సంత వేళ నరకం

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శని, ఆదివారాల్లో గొర్రెలు, మేకలు, పశువుల సంతలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు రోజులూ కాపర్లు, వ్యాపారులు, రైతులు, చిరు వ్యాపారులు పెద్ద ఎత్తున వస్తుంటారు. మార్కెట్ యార్డు వద్ద పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో సంతలు జరిగే రోజుల్లో జాతీయ రహదారిపైనే ఆటోలు, ద్విచక్రవాహనాలు, మినీ లారీలు, ట్రక్కులు ఆపాల్సి వస్తోంది. కోళ్లు, కొడవళ్లు, గొడ్డళ్లు, ఇతర సామాగ్రిని రహదారిపై విక్రయిస్తుంటారు. పశువులు, జీవాలను తరలించే వాహనాలు వందల సంఖ్యలో మార్కెట్ యార్డు నుంచి బయటకు వస్తుంటాయి. ఆ రెండ్రోజులు మార్కెట్ వద్ద ప్రయాణం వాహనదారులకు నరకం చూపిస్తోంది. విపరీత రద్దీతో ఆర్టీసీ బస్సులు నిదానంగా వెళుతుంటాయి.

గంటకు పైగా సమయం



నగరంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. రుద్రంపేట సర్కిల్‌లో తరచూ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేస్తుంటారు. సాయంత్రం అయితే ఎగ్జిబిషన్ సందర్శనకు వచ్చిన వారు తమ వాహనాలు రోడ్డు పక్కనే పార్కింగ్ చేస్తుంటారు. ఆ సమయంలో కియా కార్ల కంపెనీకి సంబంధించిన బస్సులతో పాటు కర్ణాటకు వెళ్లే లారీలు రోడ్డుమీదే ఆగిపోతున్నాయి. మూడు వైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కసారి ఇక్కడ ట్రాఫిక్‌లో చిక్కుకుంటే బయటపడేందుకు గంటకు పైగా సమయం పడుతోంది.

–ఎం. బాబాఖాన్, అనంతపురం

వాహనం అనివార్యం



గతంలో పోలిస్తే అనంతపురంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగింది. అన్ని వర్గాల ప్రజలు ప్రస్తుతం ద్విచక్రవాహనాలు వినియోగిస్తున్నారు. దీనికి తోడు ఎప్పుడుపడితే అప్పుడు భారీ వాహనాలు నగరంలోకి పట్టపగలే వస్తున్నాయి. భారీ వాహనాలను పగటి పూట నగరంలోకి రాకుండా నియంత్రించాల్సి ఉంది. నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యతో నరకం చూస్తున్నాం. సప్తగిరి సర్కిల్, బస్టాండు, పాతూరు, శ్రీకంఠం సర్కిల్‌లో ట్రాఫిక్‌ను దాటుకుని వెళ్లాడమంటే యుద్ధం చేసినట్లే.

– విష్ణువర్ధనరెడ్డి, న్యాయవాది, అనంతపురం

ఎరువుల సమస్య తలెత్తరాదు

- కంపెనీ డీలర్లను ఆదేశించిన జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఎరువుల సమస్య తలెత్తకుండా నెలవారీ కోటా మేరకు సకాలంలో అన్ని రకాల ఎరువులు సరఫరా చేయాలని ఎరువుల కంపెనీ డీలర్లను జేడీఏ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో టెక్నికల్ ఏఓ వంశీకృష్ణతో కలిసి ఎరువుల కంపెనీ డీలర్లతో ఆమె సమావేశమై మాట్లాడారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాకు 1.07 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువుల ప్రణాళిక అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ అనుకున్నట్లుగా సరఫరా చేశారని, జూలై కోటా ఇంకా అందాల్సి ఉందన్నారు. జూలై, ఆగస్టులో ఎరువుల వాడకం కాస్త అధికంగానే ఉంటుందని పేర్కొన్నారు. జూలైలో 25,801 మెట్రిక్ టన్నులు, ఆగస్టులో 24 వేల మెట్రిక్ టన్నుల వరకు సరఫరా కావాలన్నారు. ప్రణాళిక ప్రకారం ఈ ఖరీఫ్‌లో 26,839 మెట్రిక్ టన్నుల యూరియా, 18,261 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువులు ఖచ్చితంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియా, డీఏపీతో పాటు కాంప్లెక్స్‌లు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంఓపీ), సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ), అమ్మోనియం సల్ఫేట్, అలాగే నానో యూరియా లాంటి అన్ని రకాల ఎరువులు సరఫరా చేస్తే ఎక్కడా ఎలాంటి సమస్య ఉండదన్నారు. కృత్రిమ డిమాండ్ సృష్టించే చర్యలు చేపట్టినా, ఇండెంట్ ఆధారంగా సరఫరా చేయకున్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'ఉపాధి'లో అవినీతి ఆరోపణలపై విచారణ

పుట్లూరు: ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లోని అవినీతి ఆరోపణలపై గురువారం పుట్లూరు ఎంపీడీఓ కార్యాలయంలో డ్వామా పీడీ సలీం బాషా విచారణ చేపట్టారు. కాగా, ఉపాధి హామీ పథకంలో సాగుతున్న దోపిడీపై వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలోని అన్ని మండలాలతో పాటు పుట్లూరు మండలంలో జరిగిన అవినీతిపై ఆధారాలతో ఆయన ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డ్వామా పీడీ సలీంబాషా గురువారం క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టారు. మరణించిన వారి పేర్లతో బిల్లులు చేయడం, బిల్లులకు వసూళ్లు తదితర ఆరోపణలపై విచారణ కొనసాగింది. అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని సిబ్బందిని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, అధికారులు మల్లికార్జున, పర్వేష్, ఏపీఓ తులసిప్రసాద్ పాల్గొన్నారు.

మఠం ఆస్తుల పరిరక్షణకు చర్యలు

- ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి



ఉరవకొండ: కర్ణాటక, ఆంధ్ర, తెలంగాణలో ఉన్న విలువైన గవిమఠం భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకున్నట్లు ఉరవకొండ గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవ రాజేంద్రస్వామి తెలిపారు. ఈ క్రమంలోనే కర్ణాటకలో అన్యాక్రాంతమైన రూ.కోటి విలువైన భూమిని న్యాయపోరాటంతో సాధించుకున్నట్లు వివరించారు. గురువారం స్థానిక గవిమఠం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉత్తరాధికారి మాట్లాడారు. కర్ణాటకలోని చిత్రదుర్గ జిల్లా మొలకాల్మూరు తాలూకా దేవసముద్రం హోబళి కృష్ణరాజపురం గ్రామంలో సర్వే నంబర్ 39లో మఠానికి రూ.కోటి విలువ చేసే 10 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమిని సిద్దయ్య స్వామి అనే అర్చకుడు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడన్నారు. ఆయన మృతి అనంతరం అతని భార్య రుద్రమ్మ మఠం భూమిని తన పేరుపై మార్చుకునేందుకు రెవెన్యూ అధికారులను ఆశ్రయించడంతో విషయం తెలిసి ఈ ఏడాది జూలై 16న చిత్రదుర్గ జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోర్టులో పిల్ దాఖలు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం మఠానికి చెందిన భూమిని అర్చకుల పేరు మీద చేసేందుకు హక్కులేదని, వాటిని అర్చకులు అనుభవించేందుకు మాత్రమే వీలుందని న్యాయస్థానం వెల్లడి చేసిందన్నారు. రికార్డుల్లో పేర్లు మార్చడానికి ప్రయత్నించిన రెవెన్యూ అధికారులను కోర్టు మందలించిందన్నారు. దీంతో ఆ భూమికి సంబంధించి హక్కులు గవి మఠానికి కల్పిస్తూ ఆన్‌లైన్ రికార్డుల్లో పొందుపరిచారన్నారు.

అది ప్రమాదం కాదు.. హత్యే

- వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ
- భార్యనే సూత్రధారి
- కుమారుడు, అక్క కుమారుడితో కలసి కుట్ర
- నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గార్లదిన్నె: గత నెల కారు ఢీకొని రైతు మృతి చెందిన కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. అది ప్రమాదం కాదని, పథకం ప్రకారం కుటుంబసభ్యులే హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు నిర్ధారించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. గార్లదిన్నె పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామానికి చెందిన బోయ నల్లప్ప (50)కు 30 ఏళ్ల క్రితం శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. 25 ఏళ్ల క్రితం బతుకు తెరువు కోసం నల్లప్ప తెలంగాణలోని వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్రెడ్డిపల్లి సమీపంలో ఉన్న క్వారీలో పని చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న ఓ మహిళతో సన్నిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఆర్థిక సాయం అందిస్తూ ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం తెలిసి భార్య సర్దిచెప్పేందుకు ప్రయత్నించింది. అయితే భార్యకు విడాకులు ఇచ్చేందుకైనా సిద్ధమని, ఆ మహిళను మాత్రం తాను వీడి ఉండలేనని నల్లప్ప స్పష్టం చేయడంతో మనస్పర్థలు చెలరేగి ఇద్దరూ విడిపోయారు. ప్రస్తుతం లక్ష్మి తన పిల్లలతో కలసి కల్లూరు నివాసముంటోంది. నల్లప్ప అనంతపురం సమీపంలోని సోములదొడ్డిలో ఒంటరిగా ఉంటూ రోజూ ద్విచక్ర వాహనంపై ఓబులాపురం వద్ద ఉన్న తోటకు వచ్చి వెళ్లేవాడు. అప్పుడప్పుడు తెలంగాణలో ఉంటున్న మహిళ వద్దకెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆస్తి కూడా ఆమె పేరునే రాసిస్తాడనే అనుమానం నెలకొని భార్య లక్ష్మి ఆందోళనకు గురైంది. దీంతో పిల్లలకు ఆస్తి దక్కాలనే ఆలోచనతో ఎలాగైనా భర్తను హతమార్చాలని నిర్ణయించుకున్న ఆమె... తన కుమారుడు ఆశ్రయ్, పెద్దవడుగూరు మండలం చిత్రచేడులో ఉంటున్న అక్క కుమారుడు శ్రీకాంత్ కలసి నల్లప్ప హత్యకు పథకం రచించారు. పథకంలో భాగంగా జూలై 23న నల్లప్ప ద్విచక్ర వాహనంపై వ్యవసాయ తోట వద్ద నుంచి తిరిగి వస్తుండగా జంబులదిన్నె కొట్టాల సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి ఇన్నోవా కారుతో ఢీకొని హతమార్చారు. హత్యకు ఉపయోగించిన కారును అద్దెకు తీసుకున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. అయితే తొలుత ప్రమాదంలో రైతు మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా భార్య, కుమారుడిని విచారణ చేయడంతో అసలు నిజం వెలుగు చూసింది. దీంతో లక్ష్మి, ఆమె కుమారుడు ఆశ్రయ్, అక్క కుమారుడు శ్రీకాంత్‌ని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ కొండయ్య, ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

రైతులకు అన్యాయం జరిగితే చర్యలు తప్పవు : జేడీఏ

అనంతపురం సెంట్రల్: అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులైన రైతులతో ఈ–కేవైసీ చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. గురువారం తన కార్యాలయం నుంచి మండల వ్యవసాయాధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటి వరకూ దాదాపు ఏడు వేల మందికి పైగా రైతులు పెండింగ్‌లో ఉన్నారని, వారందరితో ఈ– కేవైసీ చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు శశికళ, రాకేష్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

'జేఎన్‌టీయూ' ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బీటెక్ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఎంబీఏ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్/సప్లి, ఎంబీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) సప్లి, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్/సప్లి, ఎంసీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్–21) సప్లిమెంటరీ, ఫార్మా డీ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–17) రెగ్యులర్/సప్లి ఫలితాలను గురువారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

ఇంటి పట్టాలు ఇప్పిస్తామంటూ మోసం

- అనంతలో పోలీస్ స్టేషన్ ఎదుట హిజ్రాలు, బాధితుల ధర్నా



పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న హిజ్రాలు, బాధితులు

అనంతపురం: నగరంలోని లెక్చరర్స్ కాలనీ వెనుక ఉండే ప్రభుత్వ స్థలంలో ఇంటి పట్టాలు ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసి మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ హిజ్రాలు, పలువురు బాధితులు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న సదరు స్థలంలో ఇప్పటికే 120 మంది గుడిసెలు వేసుకుని నివాసముంటున్నామన్నారు. ఈ క్రమంలో తమకు పట్టాలు ఇప్పిస్తామంటూ ఒక్కొక్కరి నుంచి రూ.2 వేల నుంచి రూ.1.50 లక్షల వరకూ బి.హనుమంతరాయుడు, బండారు చంద్ర, నీలకంఠ, సూరి, కిరణ్, మహబూబ్‌బాషా, బాబు వసూలు చేశారని, పట్టాలు ఇప్పించకపోగా, నగదు వెనక్కి ఇవ్వకుండా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన డబ్బు వెనక్కు చెల్లించమంటే బతకలేరంటూ బెదిరింపులకు దిగుతున్నారని వాపోయారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదంటూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఇంటి పట్టాలు ఇప్పిస్తామని మోసం చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలంటూ త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో హిజ్రాలు నగ్న ప్రదర్శన చేస్తూ ఆందోళన చేశారు. దీంతో మోసం చేసిన వారిలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పలువురికి బళ్లారి రాఘవ అవార్డులు



రామలింగేశ్వరరావు



భూపతి ధర్మారావు



వాల్మీకి కుళ్లాయప్ప



మల్లెల జయరామ్

అనంతపురం కల్చరల్: జిల్లా వాసులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు కళాకారులకు బళ్లారి రాఘవ అవార్డులు దక్కాయి. ప్రపంచ నాటక రంగాన్ని ప్రభావితం చేసిన 'అనంత' రంగస్థల యోధుడు బళ్లారి రాఘవ జయంతిని పురస్కరించుకుని శనివారం సాయంత్రం అనంతపురంలోని లలితకళాపరిషత్తులో ప్రత్యేక ఉత్సవాలు, సాంస్కృతిక, నాటక సంబరాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో నాటక రంగ అభివృద్ధికి కృషి చేసిన నటులు, రచయితలకు పురస్కారాలనందిస్తున్నట్లు ఎల్కేపి కార్యదర్శి పద్మజ వెల్లడించారు. అవార్డులు దక్కిన వారిలో కర్నూలుకు చెందిన రామలింగేశ్వరరావు, బాపట్ల జిల్లా రేపల్లెకు నివాసి భూపతి ధర్మారావు, అనంతపురం జిల్లాకు చెందిన వాల్మీకి కుళ్లాయప్ప, మల్లెల జయరామ్ ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్ నటుడు ఎస్ఎం బాషా ఆధ్వర్యంలో 'గోవు మాలచ్చిమి' నాటకాన్ని ప్రదర్శించనున్నారు.

రాప్తాడులో రెచ్చిపోయిన దొంగలు

- రూ.5.65 లక్షల నగదు చోరీ
- ఏడున్నర తులాల బంగారు నగలూ అపహరణ



బీరువాలో వస్తువులను చిందర వందర చేసిన దృశ్యం

రాప్తాడు: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో బుధవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో బీసీ కాలనీలో నివాసముంటున్న బాధితుడు చిరుతల ఇటుకు నల్లప్ప తెలిపిన మేరకు.. రాప్తాడుకు చెందిన చిరుతల ఈశ్వరయ్య కుమారుడు గణేష్, అద్ర వెంకటేశులు కుమార్తె సరిత వివాహం ఈ నెల 30న రాప్తాడులోని లక్ష్మీపండమేటి వేంకటరమణస్వామి ఆలయంలో జరిగింది. వివాహానికి బంధువైన ఇటుకు నల్లప్ప, తన భార్య శ్రీదేవితో కలసి వెళ్లాడు. వధూవరులిద్దరూ రాప్తాడుకు చెందిన వారు కావడంతో ఇరు వైపులా కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి మెరిమణి నిర్వహించారు. ఆ సమయంలో ఇంటికి తాళం వేసి మెరవణిలో నల్లప్ప దంపతులు పాల్గొన్నారు. విషయాన్ని గుర్తించిన దుండగులు తలుపులు ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించి బీరువాలోని ఏడున్నర తులం బరువున్న బంగారు నగలు, రూ.60వేల సొంత నగదు, ఇటుకుల పల్లయ్య స్వామి ఆలయానికి చెందిన రూ.85వేలు, మోటార్ మెకానిక్‌గా ఉన్న కుమారుడు శివయ్య బెంగళూరులో సామగ్రి కొనుగోలు చేసేందుకు ఇతరుల నుంచి అప్పుగా తెచ్చిన రూ.4.20 లక్షలను అపహరించారు. రాత్రి 11 గంటలకు మెరవణి పూర్తి కావడంతో 12 గంటలకు ఇంటికెళ్లిన దంపతులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీహర్ష, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలిముద్రలను సేకరించారు. ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

ఆటో కింద పడి చిన్నారి మృతి



తనూజ (ఫైల్)

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు ఆటో కింద పడి ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం ఈరన్నపల్లికి చెందిన వెంకటనాయుడు కొంత కాలంగా గార్లదిన్నె మండలం కల్లూరు కొండ కింద కొట్టాలలో నివాసముంటున్నాడు. ఆయన కుమార్తె తనూజ (9) గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. రోజూ ఆటోలో పాఠశాలకు వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఆటోలో వస్తుండగా ఇంటి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చే మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో ఆటోను డ్రైవర్ రివర్స్ చేశాడు. అయితే ఈ విషయం తెలియని తనూజ ఉన్నఫలంగా ఆటో దిగడంతో అదుపు తప్పి కిందపడింది. డ్రైవర్ గమనించేలోపు వాహనం బాలికపైకి దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే అదే ఆటోలో పామిడిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.

క్లుప్తంగా

నేడు 'అమరమ్' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం తెలుగు వెలుగు సాహితీ సామాజిక సేవా సంస్థ తెలుగు వెలుగు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు నిర్వాహకులు తోట నాగరాజు గురువారం వివరాలు వెల్లడించారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సామాజిక ఉద్యమకారుడు, కవి టీవీరెడ్డి రచించిన 'అమరమ్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సాహిత్యానికి వన్నె తెస్తున్న సాహితీమూర్తులను సన్మానించడం జరుగుతుందన్నారు.

క్రీడల్లో రాణించాలి


హాకీ కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కనగానపల్లి: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్నట్లు దాత బంగి పవన్ తెలిపారు. మండలంలోని తగరకుంట జిల్లా పాఠశాల విద్యార్థులకు గురువారం హాకీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాల పీఈటీ బంగి రాగేష్ సోదరుడైన పవన్ విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నట్లు తెలిపారు. ఈ మధ్యనే స్వదేశానికి వచ్చిన ఆయన ద్వారా క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో స్పోర్ట్స్ కిట్లు ఉచితంగా పంపిణీ చేయించడం జరిగిందన్నారు. విద్యార్థులు సామగ్రిని సద్వినియోగం చేసుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాధవరాజులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఆర్‌ఎంగా డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి

అనంతపురం క్రైం: ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆర్.ఆదోని గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జ్‌గా డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు, డీఎంలు, ఇతర కేడర్ సిబ్బంది ఆర్‌ఎంకు వీడ్కోలు పలికారు. ఆర్‌ఎం సుమంత్ ఆర్.ఆదోని అందించిన సేవలను కొనియాడుతూ సన్మానించారు.

ఇస్కాన్‌లో వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం కల్చరల్: నైతిక విలువలను పెంపొందిస్తూ శ్రీకృష్ణుడి విశేషాలను తెలియజేయడమే లక్ష్యంగా చిన్నారులకు పోటీలు నిర్వహిస్తున్నామని ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జ్ దామోదర గౌరంగదాసు తెలిపారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని గురువారం ఇస్కాన్ మందిరంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వేర్వేరుగా జరిగిన పోటీల్లో శ్రీమద్భాగవతంలోని ఘట్టాలు, భగవద్గీత విశిష్టతను చిన్నారులు అద్భుతంగా వివరించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు శ్రీకృష్ణామి వేడుకల్లో బహుమతులు అందజేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మార్మోగిన గోవింద నామస్మరణ


హోమం చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: గోవింద నామస్మరణతో నగరంలోని రామ్‌నగర్ వేంకటేశ్వర స్వామి ఆలయం మార్మోగింది. శ్రీవారి మందిరం 18వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వేడుకగా సాగాయి. ఉదయం గణపతి పూజలతో ప్రారంభమై వివిధ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠలను వేదపండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. అదేవిధంగా వేదమంత్రాలు, భాజభజంత్రీల వాయిద్యాల నడుమ పుష్పయాగం, అభిషేకంతో పాటూ శ్రీవారి కల్యాణోత్సవ వేడుకలు ఘనంగా సాగాయి. వందలాదిగా తరలి వచ్చిన భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపకాంతులతో భారీ ఎత్తున నగరోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా హారతులు పట్టారు. మధ్యాహ్నం, రాత్రి ఆలయంలో నారాయణ సేవ, అన్న సంతర్పణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పనుల్లో కాలయాపన..
ప్రజలకు తప్పని నిరీక్షణ

- శ్రీనగర్ కాలనీలో మూడు నెలలుగా కొనసాగుతున్న డ్రైన్ పనులు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్
- మూడు మార్గాలను బంద్ చేసిన వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తెలుగు తమ్ముళ్ల నగరంలో అభివృద్ధి జరగనివ్వకుండా.. రూ.కోట్ల అభివృద్ధి పనుల టెండర్లను రద్దు చేయించారు. కనీసం వారి ప్రమేయంతో చేస్తున్న పనులనైనా సక్రమంగా చేశారంటే అదీ లేదు. నడిమివంక, మరువవంక పూడికతీత పనుల్లో రూ.లక్షలు కొల్లగొట్టారు. ప్యాచ్ వర్కులు పనులు తేలిపోయాయి. ఇప్పుడు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో కాలయాపన చేయడంతో ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారు. ఇదేం ప్రభుత్వం.. వీళ్లెక్కడి టీడీపీ తమ్ముళ్లు అంటూ శ్రీనగర్ కాలనీ వాసులు లబోదిబోమంటున్నారు. నగరంలోని శ్రీనగర్ కాలనీలో జరుగుతున్న కాలువ పనులు పూర్తి చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మూడు నెలలుగా పనులు అరకొరగా చేస్తుండటంతో ప్రజలు శ్రీనగర్ కాలనీ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

రాకపోకలు బంద్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నుంచి నగరంలోని శ్రీనగర్ కాలనీ అభివృద్ధి చెందుతూ వస్తోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు, హైయ్యర్ ఆఫీషియల్స్‌తో పాటు ప్రముఖ ఆస్పత్రి, వైద్యులు, తదితర ఆ ప్రాంతంలో నివాసముంటున్నారు. నిత్యం వేలాది మంది ఆ మార్గం నుంచి నగరానికి వస్తుంటారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళలో వేలాది మంది ప్రజానీకం వాకింగ్‌కు వెళ్తుంటారు. కాగా ఆ ప్రాంతంలో రూ.36 లక్షల వ్యయంతో ఒక మీటర్ కాలువ 280 మీటర్ల పొడవుతో ఏర్పాటు చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. కాగా ఈ ఏడాది జనవరి 6న టెండర్లను ఆహ్వానించారు. కాంట్రాక్ట్‌ను తెలుగు తమ్ముళ్లు దక్కించుకుని నెలన్నర తర్వాత అగ్రిమెంట్ చేసుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో మొదలుపెట్టారు. కానీ ఇప్పటి వరకు పనులు పూర్తి చేయలేదు. శ్రీనగర్ కాలనీకు వెళ్లేందుక మూడు ప్రవేశమార్గాలు ఉండగా.. అక్కడ మూడు కల్వర్టులను ఏర్పాటు చేయాల్సి ఉంది. కాగా వాటిని ఏర్పాటు చేయకపోవడంతో ఆ మార్గాలను మూసివేశారు.


మురుగును మరో మార్గం ద్వారా డైవర్ట్ చేసిన దృశ్యం


నిలిచిపోయిన కాలువ పనులు

చెస్ ఆడుతున్నా.. మళ్లీ మాట్లాడతా

పనులు జాప్యానికి సంబంధించి సాక్షి ఎస్‌ఈ చంద్రశేఖర్‌కు ఫోన్ చేయగా.. సంబంధిత డీఈ, సీనియర్ అయిన బీఎల్ నరసింహను సంప్రదించాలని సూచించారు. దీంతో బీఎల్ నరసింహకు సాక్షి ఫోన్ చేయగా.. నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారు. చెస్ ఆడుతున్నా.. కాసేపయ్యాక మీతో మళ్లీ మాట్లాడుతా అంటూ బదులిచ్చారు.

భరించలేని దుర్వాసన..


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

కాలువ ఏర్పాటులో భాగంగా మురుగు నీరు బ్లాక్ అయ్యింది. దీంతో అటువైపుగా వెళ్లాంటే భరించలేని కంపు కొడుతోంది. ప్రజావసరాలున్న ప్రాంతంలో ఇంత దారుణంగా తెలుగు తమ్ముళ్లు పనులు జాప్యం చేయడం గమనార్హం. ఇక ఎప్పటికప్పుడు పనులు చేయించాల్సిన ఇంజినీరింగ్ అధికారులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి తెలుగు తమ్ముళ్లతో పనులు చేయిస్తారా లేదో వేచి చూడాలి.

రాష్ట్రంలో తాలిబన్ల పాలన

- వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ సభ్యుడు రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటనకు సంబంధించి ప్రభుత్వం పోలీసుల ద్వారా విధించిన ఆంక్షలను చూస్తుంటే రాష్ట్రంలో తాలిబన్ల పాలన సాగుతోందని చెప్పొచ్చు. కూటమి ప్రభుత్వంలోని సీఎం చంద్రబాబు నాయుడు అండ్ కో వ్యవస్థలను అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడటం ఎంత వరకు సమంజసమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి రమేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ముందస్తుగా పార్టీ శ్రేణులను అరెస్టు చేయడం, లాఠీచార్జ్ చేయించడం దారుణమన్నారు. చంద్రబాబు నాయుడు ప్రతిపక్ష హోదాలో ఉన్న సమయంలో ప్రభుత్వం పటిష్ట భద్రత కల్పించడంతో పాటు ఎక్కడైనా పర్యటించేలా సదుపాయాన్ని కల్పించిందన్నారు. ఎక్కడైనా ప్రజలు రాకుండా ఉండేలా జేసీబీలతో తవ్వించడం ఏంటన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోకతప్పదన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

అనంతపురం సెంట్రల్: ప్రకృతి వ్యవసాయంపై రైతులను చైతన్యం చేయాలని ఏపీసీఎన్ఎఫ్ ఎక్జిక్యూటివ్ వైస్ చైర్మెన్ టి.విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం నగరంలో డీపీఎం (ప్రకృతి వ్యవసాయ విభాగం) కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా డీపీఎం, ఎస్‌పీఎంయూ, సైన్స్ టీమ్, ఎన్ఆర్‌ఓ టీంలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ ఆవిష్కరణలు, వాటి ఆచరణలు, రైతుల సంక్షేమం, ప్రకృతి సమతుల్యత, భూతాపం నుండి బయట పడగలగడం, నేలల సంరక్షణ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో డీపీఎం లక్ష్మానాయక్, ఎన్ఆర్‌ఓ, ఏపీసీఎన్ఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

మోసకారి చంద్రబాబు


కూటమి వైఫల్యాలను వివరిస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 1వ డివిజన్‌లో గురువారం బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ లాలూ తదితరులు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగనన్న చేసిన మేలును ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు చేసిన దగాపై మండిపడ్డారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్లా, అవైజ్, అసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీసీహెచ్‌ఎస్ సేవలు స్ఫూర్తిదాయకం


డాక్టర్ పాల్ రవికుమార్‌ను సన్మానిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం మెడికల్: డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ సేవలు మరువలేనివని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో డీసీహెచ్‌ఎస్‌గా ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ పాల్ రవికుమార్‌ను సన్మానించారు. గత కొన్నేళ్లుగా ఆయన అందించిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన శేషజీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్, డీఆర్‌ఓ మలోల, తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పాతూరు సీడీ ఆస్పత్రిలో డీసీహెచ్‌ఎస్ కార్యాలయంలో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. వివిధ ఏరియా ఆస్పత్రుల వైద్యులు, తదితరులు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది'


లక్ష్మీ కాంతమ్మను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: అన్ని వృత్తుల్లోకెల్లా ఉపాధ్యాయ వృత్తి చాలా పవిత్రమైనదని ఎం.బండమీదపల్లి పాఠశాల హెచ్‌ఎం పీ.ఆర్.వి.ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఎం.బండమీదపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీ కాంతమ్మ ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఎంతో మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, ఉన్నత స్థాయికి చేరేలా తీర్చిదిద్దడం ఉపాధ్యాయుడికే సాధ్యమన్నారు. విధి నిర్వహణలో కష్టపడి పనిచేస్తే సమాజంలో తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను సమాజానికి మార్గదర్శకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయురాలు లక్ష్మీ కాంతమ్మను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ శివయ్య, పీడీ దండు వన్నూరప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

కనగానపల్లి: మండలంలోని చంద్రాచెర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు స్థానిక గ్రామస్తులు, ఉపాధ్యాయులు వీడ్కోలు పలికారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు పుల్లప్ప, భ్రమరాంబ, హైదర్‌వలికి శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభివృద్ధికి వారు చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగసురేష్ బాబు, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు


మద్యం సేవించిన యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వెంకటేశులు

గార్లదిన్నె: బహిరంగ ప్రదేశాలు, హోటళ్లు, ధాబాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు హెచ్చరించారు. గురువారం సీఐ కొల్లుట్లయ్య, ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషాతో కలసి డీఎస్పీ ధాబాలు తనిఖీ చేశారు. ఓ ధాబాలో మద్యం సేవిస్తున్న ఎనిమిది మంది యువకులు, ధాబా నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ అనుమతి లేకుండా ధాబా, హోటళ్లలో మద్యం తాగించిన, తాగిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి, సెల్ ఫోన్లో మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అదేవిధంగా పరిమితికి మించి వాహనాల్లో జనం తరలిస్తే , అధిక లోడ్‌తో వెళ్లితే జరిమాన విధిస్తామన్నారు. అనంతరం 44వ జాతీయ రహదారిలో నిబంధనలు పాటించని వాహనాలను ఆపి జరిమానా విధించారు.

మీ సేవలు అమూల్యం


ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులతో ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, చిత్రంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ మలోల

అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులుగా సుదీర్ఘకాలం ప్రభుత్వానికి, ప్రజలకు మీరు అందించిన సేవలు అమూల్యమని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ కొనియాడారు. గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు జిల్లా యంత్రాంగం తరఫున ఆత్మీయ సత్కారం కార్యక్రమం ఏర్పాటు చేశారు. వివిధ శాఖల్లోని ఉద్యోగ విరమణ 15 మంది ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ మాట్లాడుతూ.. శేషజీవితాన్ని ఆనందంగా గడపాలన్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో పాల్గొని స్వాంతన పొందాలని సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డీఆర్‌ఓ ఎ.మలోల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వరా?


మాట్లాడుతున్న ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి నారాయణరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని కొంత మంది ప్రభుత్వ అధికారుల తీరు, వారి వ్యవహార శైలి ఆక్షేపణీయమని ఎంపీపీల సంఘం రాష్ట్ర కార్యదర్శి, కూడేరు ఎంపీపీ నారాయణరెడ్డి, ఎంపీపీల సంఘం జిల్లా అధ్యక్షుడు, బ్రహ్మసముద్రం ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీపీ హేమలతతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జరిగిన మండల మీట్‌లో ఎంపీపీల హక్కులను కాలరాసేలా అధికారులు వ్యవహరించడం సరికాదన్నారు. సర్వసభ్య సమావేశం జరుగుతుండగా టీడీపీ నేతలు వచ్చి పదేపదే సభకు అంతరాయం కలిగించడంతో పాటు ఎంపీపీ హేమలతతో వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ఒక మహిళ అని చూడకుండా టీడీపీ నేతలు ఎంపీపీని దుర్భషలాడటం ఏమిటని మండిపడ్డారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నుంచి ఎలాంటి సహకారం లేదని ఎంపీపీ హేమలత తెలిపారు. అధికారులు టీడీపీ నేతల చెప్పుచేతల్లో ఉన్నారని.. వారు చెప్పిన పనులే చేస్తూ ప్రజా ప్రతినిధులకు కనీస గౌరవం కూడా ఇవ్వలేదన్నారు. త్వరలో ఉన్నత అధికారులను కలసి ఆత్మకూరులో చోటుచేసుకున్న పరిస్థితులను వివరిస్తామన్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ ఎంపీడీఓ విజయలక్ష్మిని సంప్రదించగా.. తనకు ఆత్మకూరు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మూడు నెలలు అప్పగించారన్నారు. గురువారంతో కాలపరిమితి ముగుస్తుందన్నారు. పింఛన్, ఇతర పనులకు సంబంధించి సంతకాలు చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులపై చర్చించేందుకు వారు ఆహ్వానించిన విషయం తనకు ఎవ్వరూ చెప్పలేదని ఎంపీడీఓ పేర్కొన్నారు.

ఎన్డీఏ నుంచి దేశాన్ని కాపాడుకోవాలి


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

రాప్తాడురూరల్: అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న ఎన్డీఏ ప్రభుత్వం నుంచి దేశాన్ని కాపాడుకోవాలి. ఇందులో భాగంగా మరో స్వాతంత్ర్య పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. గురువారం అనంతపురం రూరల్ మండలం కందుకూరులో సీపీఐ రాప్తాడు నియోజకవర్గ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్ల కిందట అధికారంలోకి వచ్చిన మతోన్మాద బీజేపీ ప్రభుత్వం అంచలంచెలుగా వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు రైతులు, కార్మికులు, కర్షకులు, పేదలు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారన్నారు. అధికారంలోకి రాగానే అవన్నీ మర్చిపోయి కార్పొరేట్ శక్తులు అదానీ, అంబానీలకు వంత పాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగాన్ని నట్టేట ముంచాడన్నారు. మహాసభల్లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్, నియోజకవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ, జిల్లా కార్యదర్శి సి. జాఫర్, సహాయ కార్యదర్శులు పాళ్యం నారాయణ స్వామి, చిరుతల మల్లికార్జున, కార్యదర్శి వర్గ సభ్యులు జె.రాజారెడ్డి, ఎస్.శ్రీరాములు, బి.కేశవ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎ.పద్మావతి, సి.లింగమయ్య, బి.రమణయ్య, రాజేష్, నాగరాజు, ఏఐఎస్ఎఫ్ కుళా స్వామి, ఏఐవైఎఫ్ సంతోష్, ప్రజానాట్య మండలి చంద్ర నాయక్, అనంతపురం రూరల్, రాప్తాడు, ఆత్మకూరు మండల కార్యదర్శులు రమేష్, రవీంద్ర, పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

అనంతపురం: నగరంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఎన్. వరలక్ష్మి, ఆదినారాయణ దంపతుల కుమార్తె మన్నల జానకి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పదో తరగతి వరకు చదివిన జానకి ఇంటి వద్దనే ఉంటోంది. బుధవారం రాత్రి 8 గంటల సమయంలో బయటికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లింది. అయితే తిరిగి ఇంటికి రాలేదు. అనంతపురం వన్‌టౌన్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో 'దుర్గం' బాలికల ప్రతిభ

కళ్యాణదుర్గం రూరల్: రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించింది. మూడు రోజుల క్రితం తిరుపతిలో జరిగిన బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడలో అనంతపురం జిల్లా జట్టు కడప జట్టుపై విజయం సాధించింది. ఈ పోటీల్లో కళ్యాణదుర్గానికి చెందిన విద్యార్థినులు ఉష, తనుశ్రీ, జ్యోత్స్న పాల్గొని ప్రతిభ కనబరిచారు. జట్టు విజయంలో దుర్గం బాలికలు కీలకపాత్ర పోషించారని కోచ్ శివ తెలిపారు.

ఆలయాల సందర్శన

కణేకల్లు: కణేకల్లు మండలం మాల్యంలోని కల్లేశ్వరస్వామి, బసవేశ్వరస్వామి ఆలయాలను దేవదాయశాఖ అధికారులు గురువారం సందర్శించారు. కల్లేశ్వరస్వామి ఆలయంలో ఫ్లోరింగ్ పనుల కోసం ప్రతిపాదనలు రూపొందించేందుకు దేవదాయశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరిత, దేవదాయశాఖ అధికారి దేవదాస్‌లు చుట్టూ కొలతలు తీసుకున్నారు. అనంతరం బసవేశ్వరస్వామి ఆలయ గోపులాపుర నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఆలయాల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామపెద్దలు గాజుల విజయ్, చంద్రశేఖర్ గౌడ్, శరబన్నగౌడ్, మహేష్‌గౌడ్, కృష్ణ, శివ, బసవన్న గౌడ్, నరేంద్రస్వామి తదితరులతో చర్చించారు.

పంట నమోదు చేసుకున్న రైతులకే పెట్టుబడి సాయం

ధర్మవరం రూరల్: పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందుతుందని డీఆర్‌సీ డీడీఏ శ్రీరామ్ నాయక్ పేర్కొన్నారు. గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌జీఓ కార్యాలయంలో రైతు సేవా కేంద్ర సిబ్బందికి డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌సీ డీడీఏతో పాటు డాట్ సెంటర్ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏడీఏ లక్ష్మానాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ, కంది, ఆముదం, పంటలకు చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు, పాటించాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. పంటలో బెట్ట పరిస్థితులు తట్టుకోవడానికి 5 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటలకు పిచికారీ చేసుకునేలా రైతులకు తెలియజేయాలన్నారు.

కొండమ్మకు సీడీపీఓగా పదోన్నతి



అనంతపురం సెంట్రల్: మహిళా, శిశు సంక్షేమ శాఖ అనంతపురం అర్బన్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ జి.కొండమ్మకు సీడీపీఓగా పదోన్నతి దక్కింది. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా సీనియర్ సూపర్‌వైజర్లకు సీడీపీఓగా పదోన్నతి కల్పిస్తూ ఆశాఖ రాష్ట్ర డైరెక్టర్ సూర్య కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. సూపర్‌వైజర్ కొండమ్మను వైఎస్సార్ కడప జిల్లా ముద్దనూరు ప్రాజెక్టు సీడీపీఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.